క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



పిల్లలకు కరపత్రాలను అందచేస్తున్న వక్కలపేట హెడ్‌టీచర్ నజీబుల్లా

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందుతుందని కడప వక్కలపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి నజీబుల్లా అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం వక్కలపేటలో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేస్తూ తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలపై అవగాహన కల్పించారు. మీ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి మేమంతా సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులతోపాటు ఆటస్థలం, మరుగుదొడ్ల సౌకర్యం ఉందన్నారు. కావున మీ పిల్లలను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైకత లింగానికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకతలింగానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అలాగే రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు, చండీమాతకు, శ్రీచక్రానికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించి కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆ సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రిటైర్డు ఆంధ్ర బ్యాంకు మేనేజర్ మూలె వెంకటరామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య లక్ష్మీదేవి, కుమారులు శ్రీకాంత్‌రెడ్డి, సుమంత్ రెడ్డి, కోడళ్లు లక్ష్మీప్రియ, అంబర్, కుమార్తె జ్యోతి ఈ కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూలె శ్రీకాంత్‌రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మీప్రియ, మూలె అర్జున్ రెడ్డి, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణరెడ్డి, ఎంవీ నారాయణ, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌రెడ్డి, లింగారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట ఎరువులు

మైదుకూరు : రైతులకు వ్యవసాయ శాఖ 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్టె ఎరువుల విత్తనాలను అందిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు మండలానికి 220 క్వింటాళ్ల జనుములు, 5 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలను కేటాయించినట్లు ఏఓ పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఆర్‌బీకేలలో పచ్చిరొట్టె విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. జనుములు 10 కిలోల పూర్తి ధర రూ.880లని, 50 శాతం సబ్సిడీ పోను రూ.440 రైతులు చెల్లించాలని, పిల్లి పెసర 10 కిలోల పూర్తి ధర రూ.1340లని, సబ్సిడీ పోను రూ.670 రైతులు చెల్లించాలని వివరించారు. పచ్చిరొట్టె ఎరువుల విత్తనాలు కావాల్సిన రైతులు తప్పనిసరిగా పాస్ బుక్, 1బీ, ఆధార్ జిరాక్స్, సెల్‌ఫోన్ తీసుకుని ఆర్‌బీకేల వద్దకు పోవాలని సూచించారు. జనుము విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బు చెల్లించిన 7–10 రోజుల లోపు వ్యవసాయశాఖ నుంచి ఆర్‌బీకేల ద్వారా రైతులకు నేరుగా అందజేస్తామని ఏఓ తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలి

ప్రొద్దుటూరు క్రైం : అసాంఘిక కార్యకలాపాలపై ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఉక్కుపాదం మోపాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ తెలిపారు. ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్రికెట్ బెట్టింగ్, మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిని పార్టీలో చేర్చుకోవద్దని ఎమ్మెల్యేను కోరారు. తాను కూడా పెద్దాయన శిష్యుడినేనని, అయితే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నట్లు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన వరదరాజులరెడ్డికి కాంగ్రెస్ పార్టీ తరపున అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఆరు సార్లు గెలిచిన పెద్దాయనకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ప్రొద్దుటూరు అభివృద్ధి కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సహకారం అందిస్తుందని చెప్పారు. సమావేశంలో పట్టణాధ్యక్షుడు జిలానిబాషా తదితరులు పాల్గొన్నారు.

కనువిందుగా శిల్ప చమత్కారం

- ఎద్దు–ఏనుగు తలలు కలిసి ఉన్న బొమ్మలు
- పలు దేవాలయాల గోడలపై చెక్కిన శిల్పకారులు
- చిన్న తేడాలతో ఆకట్టుకుంటున్న వైనం



గండికోట మాధవరాయస్వామి ఆలయంలో ఏనుగు–ఎద్దు శిల్పం



ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయంలో...



పుష్పగిరి అమ్మవారి ఆలయంలో...



చిన్నమండెం మండెంరాయుని ఆలయంలో...

కడప కల్చరల్ : ఒకప్పుడు మన జిల్లా శ్రీకృష్ణ దేవరాయలు, వారి వారసుల ఏలుబడిలో ఉండేదని చరిత్ర ద్వారా తెలుస్తోంది. రాయల వంశీకులంతా శిల్పా కళా ప్రియులే. వారి కళాదృష్టికి, తృష్ణకు నిదర్శనంగా జిల్లాలోని ఎన్నో దేవాలయాలపై అద్భుతమైన శిల్ప సంపద నేటికీ కనువిందు చేస్తోంది. నిపుణులైన శిల్పాచార్యులు జిల్లా అంతటా తమ శిష్య గణంతో ఈ శిల్ప సంపదను సృష్టించినట్లు పరిశోధకులు పేర్కొంటున్నారు. అలాంటి వాటిలో చమత్కార శిల్పాలు ప్రత్యేకమైనవి. జిల్లాలోని పలు దేవాలయాలు అద్భుతమైన శిల్ప సంపదకు మారుపేరుగా నిలిచి అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇలాంటి సంపదకు నిలయాలైన ఆ దేవాలయాల గోడలు, స్తంభాలపై శిల్పులు తమ చమత్కారాన్ని ప్రదర్శించారు. వీటిలో ఎద్దు–ఏనుగు తలలు కలిసి ఉన్న చమత్కార శిల్పం శిల్పకళా ప్రియులను ఎంతో ఆకట్టుకుంటోంది. అలాంటి శిల్పాలను నేటికీ మనం మన జిల్లాలోని పలు దేవాలయాలలో ఉన్నాయి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

ఏనుగు–ఎద్దు

జిల్లాలో ఏనుగు–ఎద్దు శిల్పాలలో ఎంతో చమత్కారం సృష్టించిన నిపుణులైన శిల్పాచార్యులు వాటిలో తమ విశిష్టతలను, ప్రత్యేకతలను చాటుకుని 500 ఏళ్ల పైబడినా వారి నైపుణ్యాన్ని చాటుతూనే ఉన్నాయి. వాటిలో ఏనుగు–ఎద్దు శిల్పం ప్రధానంగా నిలుస్తున్నది. ఈ శిల్పంలో ఏనుగు, ఎద్దు శరీరాలు వేరైనా తల మాత్రం ఒకటిగానే ఉండేలా శిల్పి చమత్కారం కనబరిచారు. ఈ శిల్పంలో తల మినహా ఎద్దు శరీరాన్ని మూసి చూస్తే ఏనుగు కనిపిస్తుంది. ఏనుగు శరీరాన్ని మూసి చూస్తే ఎద్దు శరీరం కనిపిస్తుంది. ఇలా ఒక వైపు నుంచి ఏనుగు తలలాగా, మరొక వైపు నుంచి ఎద్దు తలలాగా రూపుదిద్దడమే ఈ శిల్పంలోని చమత్కారం. అంటే ఒకే తల, రెండు శరీరాలు ఉండడం ఇందులోని ప్రత్యేకత. మన జిల్లాలో పలు దేవాలయాల్లో ఉన్న ఈ చమత్కార శిల్పం భక్తులను, సందర్శకులను, పర్యాటకులను, శిల్పకళా నిపుణులను, కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అందుకే కడపోత్సవాల ఒక సంవత్సరం ఈ శిల్పాన్ని లోగోగా ఉపయోగించారు. జిల్లాలో ఏడుచోట్ల ఈ చమత్కార శిల్పం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎక్కడెక్కడ ఉన్నాయంటే....

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలోనికి వెళ్లేటపుడు ప్రధాన ద్వారం ఎడమ గోడ చివరన ఈ శిల్పం ఉంది. అలాగే పుష్పగిరి క్షేత్రంలో శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయం కుడివైపు స్తంభంపై కూడా ఈ శిల్పాన్ని గమనించవచ్చు. దీంతోపాటు గండికోట మాధవరాయస్వామి ఆలయ మండపం ఎడమవైపు రెండవ స్తంభంపై కూడా ఇలాంటిదే. అంతేకాకుండా చిన్నమండెంలోని శ్రీ మండెం రాయుని ఆలయం మండపంలోని కుడివైపు స్తంభంపై కూడా ఈ శిల్పం కనిపిస్తుంది. ఇందులో ఒంటిమిట్టలోని శిల్పంలో ఏనుగు కుడివైపు, ఎద్దు ఎడమవైపు ఉన్నాయి. శిల్పి వీటి అలంకారంపై ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు కనిపిస్తోంది. ఎద్దుల మెడలో మువ్వల పట్టీలు, ఏనుగుపై కూర్చొనేందుకు వీలుగా గౌరవ ప్రదంగా కనిపించేలా తివాచి మలిచి ఉన్నాయి. ఇంకా ఈ రెండింటిని పూర్తి స్థాయిలో అత్యంత జాగ్రత్తగా అవయవాల మలువులో పూర్తి జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపిస్తోందని ఆలయ శిల్ప పరిశోధకులు పేర్కొంటున్నారు. పుష్పగిరి, గండికోటలలో ఏనుగు ఎడమవైపు, ఎద్దు కుడివైపున ఉండేలా మలిచారు. ఈ రెండింటిలో గండికోటలోని శిల్పం ఓ మోస్తరు అలంకరణ, స్పష్టతతో ఉండగా పుష్పగిరిలోని శిల్పం మాత్రం అంత స్పష్టత కనిపించదు. చిన్నమండెం ఆలయంలో ఒంటిమిట్టలో లాగే ఏనుగు కుడివైపున, ఎద్దు ఎడమవైపున ఉండేలా మలిచారు. ఈ శిల్పంలో కూడా అంత స్పష్టత కనిపించదు. ఈ నాలుగు చోట్ల రెండు ఆలయాలలో ఏనుగు కుడివైపున, ఎద్దు ఎడమవైపున ఉండేలా మలిచారు. మరి రెండుచోట్ల ఎద్దు కుడివైపున, ఏనుగు ఎడమవైపున ఉండేలా శిల్పాలను తీర్చిదిద్దారు. నాటి శిల్పులు తాము చెక్కిన శిల్పాల్లో తమదైనశైలి, చతురతను చాటుకునేందుకు ఇలాంటి శిల్పాలను మలిచి ఉంటారని పరిశోధకులు భావిస్తున్నారు. వీటిలో రెండింటిని నిపుణులైన శిల్పాచార్యులు మలిచి ఉంటారని, అస్పష్టంగా ఉన్న మరో రెండింటిని వారి శిష్యులు చెక్కి ఉంటారని భావిస్తున్నారు. గండికోటలో ప్రధాన గోపురం నుంచి మాధవరాయస్వామి ఆలయానికి వెళ్లే దారిలో చప్పట బండపై కూడా ఈ చమత్కార శిల్పం డిజైన్ గీసి ఉంది. అంతేకాకుండా కత్తుల కోనేరు కుడివైపు అరుగు బండపై కూడా ఈ శిల్పం డిజైన్‌ను గీచి ఉండడం గమనించవచ్చు. ఇవేగాక జిల్లాలోని దేవాలయాల్లో ఇలాంటి పోలికలు గల మరెన్నో చమత్కార శిల్పాలను గమనించవచ్చు. అష్టావక్రుడు, ఆవుదూడ, నెమలి తదితరాలను కూడా చమత్కార శిల్పాలుగా జిల్లాలోని పలు దేవాలయాల గోడలు, స్తంభాలపై చూడవచ్చు.

పౌరహక్కుల కోసం నిరంతర పోరాటం



బాలగోపాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీబ్రౌన్ కేంద్రం సిబ్బంది

కడప కల్చరల్ : పౌరహక్కుల కోసం బాల గోపాల్ ఉద్యమ స్థాయిలో నిరంతరం పోరాటం చేశారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సోమవారం ప్రముఖ ఆలోచనాశీలి, పౌరహక్కుల కార్యకర్త కె.బాలగోపాల్ 73వ జయంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ బాలగోపాల్ గణిత శాస్త్రజ్ఞుడిగా, పౌర హక్కుల కార్యకర్తగా, గొప్ప ఆలోచనాపరులలో ఒకరుగా ప్రసిద్ధులన్నారు. చదివింది గణితశాస్త్రమైనా సామాజిక శాస్త్రాలు, పౌరహక్కులు, చరిత్ర, సాహిత్యం, రాజ్యాంగం ఇలా భిన్నరంగాల్లో లోతైన అవగాహన గల మేధావి అని కొనియాడారు. ఆయన సామాజిక పరిస్థితుల అధ్యయనంలో భాగంగా వందలాది కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించి పేదలు, కార్మికులు, నిర్వాసితుల వంటి బాధితుల పక్షాన వాదించిన మానవతావాది అన్నారు. గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణ రావు మాట్లాడుతూ ప్రజల పక్షం వహించే బాలగోపాల్ దళిత, మతతత్వంపై పలు పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణ, సిబ్బంది నీలకంఠేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గో రక్షణను అమలు చేయండి



అడిషనల్ ఎస్పీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కడప కల్చరల్ : భారతదేశంలో గోవును తల్లిగా భావిస్తారని, అలాంటి వాటి రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్టాలను కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ స్థానిక ప్రతినిధులు ఏఎస్పీని కోరారు. సోమవారం వీహెచ్‌పీ జిల్లా శాఖ ప్రాంత ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ బెస్తవేముల రామమహేష్, నగర ప్రధాన కార్యదర్శి చిక్కన్న, జిల్లా కార్యదర్శి రమేష్, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్‌లు అడిషనల్ ఎస్పీ లోసారి సుధాకర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల్లో గల పశువుల యజమానుల వివరాలను జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారుల సహకారంతో సేకరించి ఆ పశువులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా చూడాలని కోరారు. మండల పోలీసు అధికారి అనుమతి లేకుండా పశువులను ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలించకుండా చూడాలన్నారు. పశువుల అక్రమ రవాణాను నివారించడం కోసం ముందుజాగ్రత్త చర్యగా వాటిని ఇతర ప్రాంతాలకు తరలించడాన్ని అడ్డుకోవాలన్నారు. కడప నగరంలోని వివిధ ప్రాంతాల్లో గల జంతు వధశాలలు, అనధికార వధ శాలల వద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేయాలని కోరారు. సున్నితమైన ప్రాంతాలలో పోలీసు పహారా ఏర్పాటు చేయాలని విన్నవించారు. నగరం నాలుగు వైపులా ఔట్‌పోస్టు, చెక్‌పోస్టులను కూడా ఏర్పాటు చేయాలని కోరారు.

మాతృత్వ అభియాన్‌పై అవగాహన ఉండాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌పై అవగాహన కలిగి ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. కడప నగరం నాగరాజుపేటలోని అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో మహిళలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలు నెలసరి ఆగిన 12 వారాల్లోపు ఏఎన్ఎం దగ్గర పరీక్ష చేయించుకుని పాజిటివ్ వస్తే గర్భిణిగా నమోదు చేయించుకుని, తమతో శిశుసంరక్షణ కార్డులో అన్ని వివరాలు నమోదు చేసి ఐడీ నంబర్ పొందాలన్నారు. తొలుత టీటీ ఇంజెక్షన్ ఇచ్చి నెల తర్వాత రెండో ఇంజెక్షన్ ఇస్తారన్నారు. నాలుగో నెల నుంచి ఐరన్, క్యాల్షియం మాత్రలు వేసుకుంటూ ఉండాలన్నారు. గర్భస్థ సమయంలో రెండు సార్లు సాధారణ స్కాన్ తీసుకోవాలన్నారు. ఏదైనా ఇబ్బందికర పరిస్థితి ఉంటే వెంటనే పెద్ద హాస్పిటల్‌కు రెఫర్ చేస్తారన్నారు. అలాగే ప్రతి నెల 9, 10వ తేదీల్లో గర్భిణులకు యూపీహెచ్‌సీల్లో అన్ని రకాల పరీక్షలతోపాటు, పౌష్టికాహార ప్రాధాన్యతపై వివరిస్తారన్నారు. అలాగే ఎక్కడ కాన్పు కావాలో ముందే నిర్ణయం తీసుకోవాలని, జాగ్రత్తలన్నీ పాటిస్తే పండంటి బిడ్డకు జన్మనివ్వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ వైద్యులు డాక్టర్ శివ, కౌశిక్, నితీష్, శశి రామంజులమ్మ, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

దోమల దండయాత్ర



ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల, మున్సిపల్ పరిధిలో దోమలు విజృంభిస్తున్నాయి. రోజురోజుకూ దోమలు స్వైర విహారం చేస్తుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. దోమల నివారణ చర్యల్లో మండల, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో దోమకాటుకు గురవుతున్న ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. గ్రామీణ, మున్సిపాలిటీలో ఖాళీ స్థలాల్లో తుప్పలు, పిచ్చి మొక్కలు పెరగడం దోమల వృద్ధికి కారణమవుతున్నాయి. మలేరియా, విభాగం అధికారుల నిర్వహించిన సర్వేలో ఎనిమిది రకాల దోమలు వృద్ధి చెందుతున్నట్లు గుర్తించారు. కానీ వాటి నిర్మూలించే చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

దోమల విస్తరణ ఇలా..

సాధారణంగా క్యూలెక్స్, ఎనాఫిలస్, ఏడీస్ రకాల దోమలు నివాస ప్రాంతాల్లో పుట్టుకొస్తున్నాయి. గృహాల్లోని పూల కుండీలు, చెట్ల గుబురుల్లో గుడ్లు పెడుతాయి. ఈ దోమలు కుట్టడం వలన డెంగీ, మాలేరియా వ్యాపించే ప్రమాదం ఉంది. మురుగునీరు నిల్వ ఉండే చోట, కాలువల్లో పుట్టుకొస్తున్నా దోమలు కుడితే చర్మంపై దద్దుర్లు పుట్టి విపరీతమైన మంట వస్తోంది. ఈ దోమలు పరిమాణంలో మామూలు దోమలు కంటే పెద్దవిగా ఉంటాయి. మనుషులపై దాడి చేసినప్పుడు ప్రత్యేకంగా హెపరిన్ అనే హార్మోన్ విడుదల చేస్తాయి. ఇది విడుదల కాగానే కుట్టిన చోట రక్తం పలుచగా అవుతుంది. అప్పుడు మాత్రమే ఈ దోమ నేరుగా రక్తాన్ని తాగడం మొదలు పెడుతుంది. వీటి నివారణకు యంత్రాంగం నిర్మాణాత్మక చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వీసు నౌ సంస్థతో కేఎస్ఆర్ఎం ఎంఓయూ



సర్వీస్ నౌ డైరెక్టర్ భాస్కర్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం వారికి సర్వీస్ నౌ సంస్థతో ఎంఓయూ కుదిరినట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు. బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు సర్వీస్ నౌ వారిచే సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ అందించడం కోసం సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వీస్ నౌ డైరెక్టర్ భాస్కర్ మాట్లాడుతూ సర్వీస్ నౌ అడ్మినిస్ట్రేషన్ అండ్ అప్లికేషన్ డెవలపర్ కోర్సెస్ చేయడం వల్ల విద్యార్థిని, విద్యార్థులకు అధునాతన సాంకేతిక నైపుణ్యంతోపాటు టీసీఎస్, అసెంచర్, కాప్‌జెమిని లాంటి ఎంఎన్‌సీ కంపెనీస్‌లో ఉపాధి అవకాశాలు పొందడానికి దోహదం చేస్తాయని అన్నారు. ఏపీలోని ప్రైవేటు అటానమస్ కళాశాలలో ఇంటువంటి అవగాహన కార్యక్రమం మొదటిదని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల కరస్పాండెంట్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్ ప్రసాద్, సీనియర్ టీపీఓ నాగరాజు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనధికారిక నిర్మాణాలపై చర్యలేవీ?

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగర పాలక సంస్థ పరిధిలో అనధికార నిర్మాణాలపై ఫిర్యాదులు చేస్తున్నా, సిటీ ప్లానింగ్ విభాగం వారు తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. నగరంలోని హోచిమిన్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయాల్సింది పోయి, అయిన వారికి, పెద్ద వారికి నోటీసులతో సరిపెట్టడం.. ఒక సెంటు, రెండు సెంట్లలో సామాన్యుల ఇళ్ల నిర్మాణాలను కూల్చేస్తున్నందున పలు విమర్శలకు తావిస్తోందన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండావధూత ఆశ్రమం, గోవిందయ్యమఠం ఆవరణలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయశాఖ కార్యనిర్వాహణాధికారి సి.శివయ్య, ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం అంకురార్పణ, నవకలశస్నపనం, అభిషేకం, 11వ తేదీ ఉదయం ధ్వజారోహణం, కుంభప్రతిష్ఠ, నిత్యహోమం, సాయంత్రం శేషవాహనంపై గుడి ఉత్సవం, 12వ తేదీ ఉదయం చతుస్థానార్చన, మూలమూర్తిహోమం, సాయంత్రం ఎదురుకోళ్ళు, 13వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, సాయంత్రం హనమంత వాహనసేవ, 14వ తేదీ ఉదయం మూలమూర్తిహోమం, ఉత్సవబలి, సాయంత్రం గరుడవాహనంపై గ్రామోత్సవం, 15వ తేదీ ఉదయం అశ్వవాహనసేవ, చక్రస్నానము, సాయంత్రం ధ్వజావరోహణం, అనంతరం పుష్పయాగము కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల అంకురార్పణ సందర్భంగా పుట్టమట్టిని ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, శ్రీధర్, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

హైలెవెల్ వంతెన నిర్మించండి

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల–పొట్టిపాడు గ్రామాలకు వెళ్లే రహదారిలో మడువంకపై హైలెవెల్ వంతెన నిర్మించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలంలో అయితే ఈ లోలెవెల్ వంతెనపై నాలుగు అడుగుల మేర నీరు పారుతుంటాదని, దీంతో వాహనదారులు పొట్టిపాడు మీదుగా ప్రొద్దుటూరుకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు చెప్పారు. ప్రొద్దుటూరు పట్టణానికి చేరుకోవాలంటే దాదాపు 25 కిలోమీటర్లు చుట్టూ తిరిగి పోవాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైలెవెల్ వంతెన నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

ప్రొద్దుటూరు : ఏపీ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రొద్దుటూరు ఏరియా లేబర్ కార్యాలయం ఉద్యోగికి ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి చిన్న ఓబన్న, ఉపాధ్యక్షుడు శేషారెడ్డి, సహాయ కార్యదర్శులు సత్యరాజు, సుదర్శన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల మందికి కార్మిక సంక్షేమ బోర్డు గుర్తింపు కార్డులు ఉన్నాయన్నారు. కార్డులు పొందని మరో 30 లక్షల మంది కార్మికులు ఉంటారని పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : కల్తీ ఎరువులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాలని సోమవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏ ఎం.నాగరాజుకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, నాగార్జున, రూరల్ కార్యదర్శి బాలగురవయ్య, ఉపాధ్యక్షులు యువరాజ్, ఆంజనేయులు, కోశాధికారి సురేంద్ర పాల్గొన్నారు.

అధైర్య పడవద్దు.. అండగా ఉంటా

- కలసికట్టుగా ఉందాం
- ధైర్యంగా ఎదుర్కొందాం
- మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం: రాబోయే రోజుల్లో ఎలాంటి ఘటనలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొందామని, అందరికీ అందుబాటులో ఉంటానని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని ఊహించలేదన్నారు. మన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడని, తిరిగి సీఎం కావడం తథ్యమన్నారు. కలసి కట్టుగా ఉంటే ఎలాంటి ఘటనలనైనా ఎదుర్కోవచ్చన్నారు. దాడులను కలసికట్టుగా ఎదుర్కొందామని భరోసా ఇచ్చారు. నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా తనకు సమాచారమివ్వాలని సూచించారు. ప్రభుత్వం తరపున ఎలాంటి తప్పు జరిగిన ప్రతిపక్ష స్థాయిలో ఉన్న మనం వాటిని ఎత్తి చూపుదామన్నారు. పార్టీ అధిష్టానం ప్రతి నియోజకవర్గానికి లీగల్ టీంను ఏర్పాటు చేసిందని, వారి సేవలు ఉపయోగించుకుందామని సూచించారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌పై చర్చ

2024 సాధారణ ఎన్నికలు దేశ వ్యాప్తంగా జరిగాయని, అయితే అసెంబ్లీ ఎన్నికలు జరిగిన నాలుగు రాష్ట్రాల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని చర్చ జరుగుతోందని రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఏపీలో కూడా ఈవీఎంలు ట్యాంపరింగ్ జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్ రెడ్డి, ఉత్తమారెడ్డి, గంగాధర్ రెడ్డి, మహ్మద్ సాదిక్ కార్యకర్తలు పాల్గొన్నారు.